**జరిగిన కథ :** ధారానగరానికి వెళ్తున్న ఏడుగురు మిత్రుల కథ ఇది. ముగ్గురు మిత్రులు ఇప్పటికే ఆ నగరం చేరుకున్నారు. నాలుగోవాడైన కుచుమారుడు, ఐదోవాడైన గోనర్దీయుడు పురందరపురంలో ఉన్నారు. ఆరోవాడైన చారాయణుడు భైరవుడనే తాంత్రికుడి వల్ల గాడిదలా మారి ఎటో పోయాడు. ఏడోవాడైన ఘోటకముఖుడు, భోజరాజుకు సాయం చేయడానికి పురందరపురం వచ్చాడు.






# కుచుమారుడు గెలిచాడు

అనుసృజన:
**నేతి సూర్యనారాయణ శర్మ**

పురందరపురం కవిపండితులతో కిటకిటలాడుతున్నది. ఆ నగరాధిపతి అయిన హిరణ్యగర్భుడు తిరిగి వచ్చాడు. ఆయన తన కూతురైన సరస్వతి చాలాకాలంపాటు ఎవరినీ వరించకపోవడంతో విసిగి వేసారాడు. రాజ్యాన్ని మంత్రులకు అప్పగించి వనవాసానికి వెళ్లిపోయాడు. చివరికి ఆమె కుచుమారుణ్ని వరించిందని తెలిసి సంతోషించాడు. ఇంతలో.. 'అతను కుచుమారుడు కాదు. అవునని నిరూపిస్తే తప్పక అతణ్నే పెళ్లాడతాను' అని ఆమె చెప్పడంతో రాజధానికి తిరిగి వచ్చాడు.

ధర్మనిర్ణయం చేయడానికి కవిపండితులందరూ రావాల్సిందిగా ఆహ్వానిస్తూ వర్తమానాలు పంపాడు. ధారానగరానికి కూడా వర్తమానం వెళ్లింది. భోజరాజు, కాళిదాసు కూడా ఆ సభకు వస్తారని అంతా అనుకున్నారు. కానీ, చివరి నిమిషంలో భోజరాజు ధారానగరంలో లేడని, కాళిదాసు ప్రస్తుతం అల్లాణభూపతి ఆస్థానంలో ఉన్నాడని తెలిసి నిరుత్సాహపడ్డారు. నిజానికి ఘోటకముఖునితో కలిసి.. భోజరాజు ఆ సభకు రానేవచ్చాడు. కానీ, ఆ సంగతి ఎవరికీ తెలియదు.

ధర్మనిర్ణయానికి సభాపతిగా ఎవరు ఉండాలనే చర్చ వచ్చినప్పుడు భోజరాజే.. ఘోటకముఖుని పేరు ప్రతిపాదించాడు. గోనర్దీయుడు రాజ్యాధిపతి హోదాలో వచ్చాడు. అతని పక్కనే కుచుమారుడు కూడా ఆసీనుడయ్యాడు. ఘోటకముఖుని ఎంపికను గోనర్దీయుడు సమర్థించాడు.

సభాపతి హోదాలో ఘోటకముఖుడు ప్రశ్నించాడు.

''కుచుమారా! నువ్వు నిజమైన కుచుమారునివి కాదని సరస్వతి చెబుతున్నది. దీనికేమంటావు?''.

''అయ్యా! నేనే కుచుమారుణ్ని. సరస్వతిని అన్ని విద్యలలోనూ ఓడించాను. దైవికంగా ఆమె పంపిన చిలుక ఒక పిల్లి వల్ల చచ్చింది. మళ్లీ ఆమె మరో చిలుకను పంపి, దానికి విద్యలు నేర్పమని కోరింది. నేను అందుకు అంగీకరించలేదు. ఒకే పనిని మళ్లీ మళ్లీ చేయమని చెప్పడం మాకు అవమానకరం. ఇష్టముంటే పెళ్లి చేయండి. లేదంటే నా దారిన నేను పోతాను'' అన్నాడు.. మాయా కుచుమారునిగా వేషం వేసుకున్న శంబరుడు.

''ఆ మాట సమంజసంగా లేదు. మళ్లీ మళ్లీ చెప్పినంత మాత్రాన విద్యలకు అవమానం కాదు. ఆమెకు కాదు, మా ప్రశ్నలకు సమాధానం చెబుతావా?''.

''నేనెవ్వరికీ చెప్పదలుచుకోలేదు''.

''బహుశా.. నువ్వు చదివిన విద్యలన్నీ చిలుకకు ఉపదేశించడం వల్ల మరుపునకు వచ్చాయేమో!''.

''అది కూడా కావచ్చు!''.

శంబరుడు చెప్పిన సమాధానానికి సభంతా పకపకమని నవ్వింది. ఆ నవ్వుల మధ్య..

''పోనీ.. నీకు కుచుమారుడు అని పేరున్నట్లు మీ గ్రామస్తుల చేత చెప్పించగలవా?'' అని ప్రశ్నించాడు ఘోటకముఖుడు.

''చెప్పించగలను. కానీ.'' అని తడబడసాగాడు శంబరుడు.

అప్పుడు క్రోధాతిరేకంతో..

''ఓరీ! నువ్వు కుచుమారునివి కాదు. నేను, కుచుమారుడు ఒకే గురువు దగ్గర చదువుకున్నాం. నా మిత్రుడే రాజపుత్రికను ఓడించాడన్నమాట వాస్తవం. నువ్వతని స్థానంలోకి ఎలా వచ్చావు? నా మిత్రుణ్ని ఏం చేశావు?! చెప్పకపోయావో నువ్వు రాజదండనకు గురికాక తప్పదు'' అని పలికాడు ఘోటకముఖుడు.

సభ వైపు తిరిగాడు.

''అయ్యా! వీడు వట్టి శుంఠ. వీని వద్ద సంస్కారమేమీ లేనట్లు ఆ మాటతీరు చూస్తుంటేనే తెలుస్తున్నది. రాజపుత్రిక బుద్ధిమంతురాలు కాబట్టే నిజం గ్రహించింది. ఆమె ఈ మూఢుణ్ని పెళ్లాడటం సమంజసం కాదు. కుచుమారుడే తగినవాడు. వాణ్ని వెతికి తెప్పించడమే సరైనది'' అని పలికి కూర్చున్నాడు.

సభవారంతా కరతాళ ధ్వనులు చేశారు.

అప్పుడు గోనర్దీయుడు లేచి నిలబడి..

''అయ్యా! నేనిప్పుడు యదార్థం చెబుతున్నాను వినండి. ఇప్పుడు కుచుమారుని వేషంలో ఉన్నవాడి పేరు శంబరుడు. నా మిత్రుడైన కుచుమారునికి వంట చేసే నిమిత్తం ఈ నగరంలో ప్రవేశించాడు. సరస్వతిని గెలుచుకున్న తరువాత ఒకనాడు కుచుమారుడు నిద్రపోతుండగా వాని శిరస్సుపై బండవేసి పగులగొట్టి.. వీడు అతని స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఇప్పుడు చెపుతున్నాను. ఇదిగో.. ఇతనే నిజమైన కుచుమారుడు'' అని సభకు పరిచయం చేశాడు.

కుచుమారుడు లేచి నిలుచున్నాడు.